# ప్రతి పక్షాలను బొంద పెట్టాలి

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- రాష్ట్రానికి బీజేపీ చేసేందేమీ లేదు
- కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పాలి



కందుకూరులో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, అక్టోబర్ 27 : ఈ ఎన్నికల్లో ప్రతి పక్షాలను బొంద పెట్టాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సామ నర్సింహా రెడ్డి ఫంక్షన్ హాలులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకు ముందు హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై టపాసులు కలుస్తూ, పూలవర్షం కురిపించి మంత్రికి స్వాగతం పలుకుతూ.. ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రానికి బీజేపీ చేసేందేమీలేదన్నారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులకు బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలకు కండ్లు మండుతున్నాయన్నారు. దేశానికి అన్నం పెట్టే స్థాయికి రాష్ట్రం ఎదిగిందని, దీని కంతటికి కారణం సీఎం కేసీఆర్ అని కొనియాడారు. ప్రజలు, రైతులు కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపొవద్దని కోరారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు. కరెంట్, తాగునీరు, అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న మనం కాంగ్రెస్ చేతుల్లోకి పోతే ఆగం కావాల్సి వస్తుందన్నారు. వందేండ్ల ప్రగతిని సీఎం కేసీఆర్ 10ఏండ్లలో చేసి చూపించాలరని వివరించారు.

# బీఆర్ఎస్‌తోనే సంక్షేమ పాలన

**చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి**



ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఇతర పార్టీల నాయకులు

వికారాబాద్, అక్టోబర్ 27 : రాష్ట్ర ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేసి అభివృద్ధి చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మరో సారి గెలిపించుకోవాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి కోరారు. శుక్రవారం సాయంత్రం పెద్ది అంజయ్య ఆధ్వర్యంలో ఆలంపల్లి నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో 300 మంది ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ బీఎస్పీ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పెద్ది అంజయ్య బీఆర్ఎస్ పార్టీలో చేరడంపై మంచి నిర్ణయం తీసుకున్నారన్నారు. తెలంగాణ సంక్షేమ ఫలాలు ఇంటింటికీ అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగేందర్‌గౌడ్, వడ్ల నందు, పార్టీ మండల అధ్యక్షుడు కమాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కమాల్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, రవిశంకర్, షఫీ, అనీల్, గిరీష్‌కొఠారీ, కిషోర్, సురేశ్ పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

# బీఆర్ఎస్ గెలుపు ఖాయం

కొత్తూరు, అక్టోబర్ 27: బీఆర్ఎస్ పార్టీ మళ్లీ షాద్‌నగర్‌లో అత్యధిక మెజార్టీతో గెలుస్తుందనే నమ్మకంతోనే వివిధ పార్టీల నాయకులు భారీగా చేరుతున్నారని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంజయ్యయాదవ్ సమక్షంలో కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ తండాలోని 100 మంది వివిధ పార్టీలకు చెందిన యువకులు సర్పంచ్ అజయ్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర పార్టీలపై యువతకు నమ్మకం పోయిందన్నారు. అందుకే బీఆర్ఎస్ వైపు చూస్తున్నారన్నారు. హ్యాట్రిక్ విజయం సాధించి తీరుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు పెంటోనోళ్ల యాదగిరి, మిట్టునాయక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రషీద్, లావుడ్య గోపాల్‌నాయక్, లింగం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్**



సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ): ఎన్నికల విధులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గం పీఓ, ఏపీఓ, పోలింగ్ సిబ్బందికి దోమలగూడ ఏవీ కళాశాలలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ట్రైనింగ్ క్లాస్‌లను ఆషామాషీగా తీసుకోకుండా సీరియస్‌గా తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ డే సందర్భంగా పీఓలు తీసుకోవాల్సిన చర్యలు, బాధ్యతపై క్లుప్తంగా వివరించారు. ఎన్నికల కమిషన్ ప్రతి అంశంపై విధులకు సంబంధించిన నిబంధనలు జారీ చేసిందనీ, ఈ నేపథ్యంలో పీఓ బుక్‌లో పొందుపర్చిన నియమావళి ప్రకారంగా విధులు నిర్వహించాలన్నారు. మాక్ పోలింగ్ సందర్భంగా పాటించాల్సిన అంశాల గూర్చి వివరించారు. మాక్ పోలింగ్ ఉదయం 5.30 గంటలలోగా పూర్తి చేయాలని, కనీసం ఇద్దరు ఏజెంట్లు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. కొందరు పీఓలు శిక్షణకు రాకుండా ఓవర్ కాన్ఫిడెన్స్‌తో తప్పులు చేస్తారని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని, తప్పులు జరిగితే క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటారన్నారు. ఎన్నికల సమయంలో సస్పెండ్ చేస్తే ప్రభుత్వం కూడా పట్టించుకోదని తెలిపారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ ఆర్ఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

**శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, అక్టోబర్ 27: కండ్ల ముందే జరిగిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్, ఇజ్జత్ నగర్ కాలనీలో ఎమ్మెల్యేకు మద్దతుగా అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజలతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బీఆర్ఎస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కండ్ల ముందే ఉన్నదని, దానిని చూసి మరోసారి తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడానికి నా వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని ఇప్పటి వరకు రూ. 9 వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశానని తెలిపారు. శేరిలింగంపల్లిలో ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు, కొత్త రోడ్లు వేశామన్నారు. అభివృద్ధికే పట్టం గడుతామని..ఎన్నికల్లో పూర్తి స్థాయి మద్దతు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీకే ఉంటుందని ఆదిత్యానగర్, ఇజ్జత్ నగర్ కాలనీ వాసులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవంబర్ 21 వరకు జీవాలకు టీకాలు

మొయినాబాద్, అక్టోబర్ 27 : గొర్రెలు, మేకలకు ఈ నెల 30 నుంచి నవంబర్ 21 వరకు టీకాలు ఇవ్వనున్నట్లు మండల పశువైద్యాధికారి దేవిరెడ్డి తెలిపారు. జీవాల్లో వచ్చే నల్లమబ్బు, మసక వ్యాధిని అరికట్టడానికి పీపీఆర్ టీకాలు ఇస్తామన్నారు. తమ గ్రామాల్లో క్యాంపులు నిర్వహించిన రోజున జీవాలకు టీకాలు వేయించాలని సూచించారు. ఈ అవకాశాన్ని గొర్రెలు, మేకల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 31వరకు దరఖాస్తుల ఆహ్వానం


షాబాద్, అక్టోబర్ 27: షాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాచ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ హిందీ, పీజీటీ జియోలజీ, కామర్స్ బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 31న సాయంత్రం వరకు షాబాద్ ఆదర్శ పాఠశాలలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. టీజీటీ హిందీ బోధించడానికి డిగ్రీ, హెచ్‌పీటీ, టెట్, పిజీటీ కామర్స్, ఎం.కమ్, బీఈడీ, పీజీటీ జియోలజి, ఎమ్మెస్సీ, బీఈడీ అర్హత ఉండాలని తెలిపారు.

## నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 27: షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం ఉష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి నెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ ప్రయాణికులకు ఆర్టీసీ ద్వారా ఎలాంటి సమస్యలు ఉన్నా డయల్ యువర్ డీఎం ద్వారా 9959226287 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ప్రయాణికులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కొనసాగుతున్న విశ్వశాంతి మహాయాగం

షాద్‌నగర్‌టౌన్, అక్టోబర్ 27 : శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామిజీ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో శ్రీకృష్ణ కాలచక్రం అయుతచండీ మహాయాగం పూజలు వేదమంత్రోచ్ఛారణాలతో కొనసాగుతున్నాయి. భక్తులకు భోజన వసతిని కల్పించారు. శుక్రవారం ఉదయం మహాగణపతి, లక్ష్మీగణపతి, చండీహోమాలు, సాయంత్రం అమ్మవారికి విశేషంగా కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహాయాగంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భగవానుడి కృపకు పాత్రులుకాగాలన్నారు.



మహాయాగంలో వేదమంత్రోచ్చారణ చేస్తున్న అర్చకులు